క్లుప్తంగా

రహదారికి మరమ్మతులు



ధన్వాడ: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి లింగంపల్లి గేటు వరకు గుంతలమయంగా మారిన బీటీ రోడ్డుకు అధికారులు మరమ్మతులను శుక్రవారం ప్రారంభించారు. మరమ్మతుల కోసం రూ.1 కోటి నిధులు మంజూరు అయ్యాయని ఈ మేరకు పనులు చేపట్టినట్లు ఏఈ శేఖర్ తెలిపారు.

కన్మనూర్‌లో వైద్యశిబిరం



మరికల్: మండలంలోని కన్మనూర్ గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ఆస్పత్రి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ మేరకు ప్రత్యేక వైద్య సిబ్బంది గ్రామస్తులకు పరీక్షలు చేశారు. చిన్న చిన్న సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్స నిమిత్తం హైదరాబాద్ రావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శరత్‌చంద్రరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

లీగల్ సెల్ కన్వీనర్‌గా నరేందర్‌సాగర్

మక్తల్: యువ మోర్చా రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్‌గా మక్తల్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది నరేందర్‌సాగర్‌ను శుక్రవారం ఎంపిక చేయడంపై పలువురు బీజేపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు అధ్యక్షుడు భాను ప్రకాష్ నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. నరేందర్‌సాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి లీగల్ సెల్ కన్వీనర్‌గా నియమించడం పట్ల బండి సంజయ్, డీకే అరుణ, భాను ప్రకాష్, నాగురావు నామాజీ, రంతగ్ పాండురెడ్డి తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధన్వాడ: మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఉన్న గిరిజన గురుకుల పాఠశాలలో టీజీటీ సైన్స్ సబ్జెక్టులో పార్టు టైం పద్ధతిన పని చేసేందుకు బీఎస్సీ, బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ ఎం రాజారాం తెలిపారు. ఆసక్తి, అర్హతలు కలిగిన అభ్యర్థులు సంబంధిత ధ్రువ పత్రాలతో ఈ నెల 23న పాఠశాలలో ఉదయం 10 గంటలకు డెమోకు హాజరు కావాలని పేర్కొన్నారు.

లారీ ఢీ : ఇద్దరికి తీవ్ర గాయాలు

మరికల్: వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్రగాయాలైన ఘటన శుక్రవారం శుక్రవారం పెద్దచింతకుంట స్టేజీ దగర చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కన్మనూర్‌కు చెందిన ఎల్లప్ప, చిట్టెమ్మలు బైక్‌పై దేవరకద్ర మండలం బస్వయపల్లికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సొంత ఊరికి వస్తుండగా పెద్దచింతకుంట స్టేజీ వద్ద వెనుక నుంచి లారీ అదుపు తప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో వారు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్లప్ప పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు.

డబ్బాల తొలగింపులో ఉద్రిక్తత

అమరచింత: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించే సమయంలో డబ్బాల యజమానులు, మున్సిపల్ సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకోంది. అక్రమంగా డబ్బాలను ఏర్పాటు చేసుకున్నారని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా ఆదేశాలతో వాటిని తొలగించే కార్యక్రమానికి మున్సిపల్ సిబ్బంది శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ సిబ్బంది డబ్బాలను తొలగించేందుకు వెళ్లగా డబ్బాల యజమానులు అడ్డుకున్నారు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణకు దారితీసింది. అనంతరం డబ్బాల యజమానులు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి తమ సమస్యను పరిష్కరించడంతో పాటు ఉపాధి చూపే వరకు డబ్బాలను తొలగించొద్దని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా మాట్లాడుతూ అక్రమంగా డబ్బాలను వేసుకున్నారని, వాటిని అక్కడి నుంచి తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

కోయిల్‌కొండ: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్‌ఐ శ్రీనయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వివేకానంద యూత్ డే సందర్భంగా నిర్వహించిన రన్నింగ్ రేస్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు చదువుతోపాటు క్రీడా రంగాల్లో రాణించాలని సూచించారు.

రైతుల అభ్యున్నతే ధ్యేయం

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి
- సీఎంఆర్ ఎఫ్ చెక్కు అందజేత



రుద్రసముద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్: రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. రైతులు పంటల సాగులో అధికారుల సూచనలు పాటించి అధిక లాభాలు పొందాలని సూచించారు. ప్రాజెక్టు వరితో తక్కువ నీటి లభ్యతలోనూ అధిక దిగుబడి పొందవచ్చని పేర్కొన్నారు. రుద్రసముద్రంలో ఈ మేరకు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాల్గొన్న ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడారు. సీఈఓ సూరజ్‌తేజ, నాగరాజు, సైంటిస్ట్ రామకృష్ణ, ఏఓ మితిన్‌చక్రవర్తి, సర్పంచ్ లక్ష్మి, ఎంపీటీసీ వెంకటయ్య, ప్రాజెక్టు కోఆర్డినేటర్ వశిష్టకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయంమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. రుద్రసముద్రం గ్రామానికి చెందిన స్వాతికి అనారోగ్యం ఉండటంతో ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు శుక్రవారం అందజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే చిట్టెంకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా, మహిపాల్‌రెడ్డి, శేకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, అన్వర్ పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యం



నారాయణపేటలో కంటి వెలుగు శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి



గుడిగండ్లలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

నారాయణపేట రూరల్ : అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తుందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలో జరుగుతున్న కంటివెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడికి వచ్చిన పలువురు వృద్ధులను సమస్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు విజయ్‌సాగర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కన్నజగదీష్, కౌన్సిలర్లు, కోటకొండ పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మక్తల్: కలెక్టర్ కోయ శ్రీహర్ష గుడిగండ్లలో కంటి వెలుగు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన వెంట డీఎంహెచ్ఓ రాంమనోహర్‌రావు, డాక్టర్లు నిరోజా, అభినేష్, ఎఎన్ఎంలు సుజాత, అనసూయ, సరిత, సులోచనమ్మ, ఆశా వర్కర్లు

ఊట్కూరు: కంటి వెలుగు కార్యక్రమంలో అర్హులైన వారందరికీ రీడింగ్ కంటి అద్దాలను వెంటనే ఇవ్వాలని కలెక్టర్ కోయశ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఊట్కూరులో కంటి వెలుగు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రాంమనోహర్ రావు, డీపీఓ మురళి, సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఇబాదూర్ రహిమాన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరికల్: కలెక్టర్ కోయ శ్రీహర్ష మరికల్‌లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్ఓ రాంమనోహర్‌రావు, సర్పంచ్ గోవర్ధన్, గోపాల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధన్వాడ: ప్రతి ఒక్కరికి కంటిచూపు ఇబ్బందులు తొలగించి, అంధత్వం లేని సమాజాన్ని నిర్మించడమే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని, అందుకే ప్రతిష్ఠాత్మకంగా కంటివెలుగు కార్యక్రమంను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కంటివెలుగు కేంద్రంను ఆయన పరిశీలించారు. అదనపు కలెక్టర్ పద్మజరాణి, ఎంపీడీఓ సద్గుణ, బీఆర్ఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

మరికల్: కంటి వెలుగుపై ప్రజాప్రతినిధులు, ఆశ కార్యకర్తలు శుక్రవారం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఎంపీటీసీ గోపాల్ మాట్లాడుతూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



మరికల్‌లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఎల్వోసీ అందజేత

దామరగిద్ద: మండలంలోని చాకలోన్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాంరెడ్డి కుమారుడు వైద్య పరీక్షలకు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి శుక్రవారం రూ.లక్ష రూపాయల ఎల్‌ఓసీని అందజేశారు. ఈ మేరకు ప్రత్యేక చొరవ చూపిన ఆయనకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆశన్న, సర్పంచ్ సురేఖా, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డిలు తెలియజేశారు.

పేలిన రిఫ్రిజిరేటర్

దామరగిద్ద: రిఫ్రిజిరేటర్ పేలిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండల కేంద్రమైన దామరగిద్దలో చాపలి లక్ష్మప్ప ఇంట్లో ఓ కంపెనీ రిఫ్రిజిరేటర్‌ను ఉపయోగిస్తున్నారు. కాగా శుక్రవారం పేలి పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేకపోవడంతో ప్రమాదం చోటు చేసుకోలేదు. ఈ మేరకు రిఫ్రిజిరేటర్ కంపెనీపై ప్రభుత్వం చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు అంటున్నారు.

డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని వినతి



మక్తల్: పట్టణంలో 9వవార్డులో, రాంలీలా మైదానంలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కాలనీ వాసులు కమిషనర్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని వెంటనే పనులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి , కాటం సుదీర్‌రెడ్డి, రాములు, నాగప్ప, శ్రీనివాసులు, శంకర్‌రెడ్డి, ఉమాశంకర్, చంద్రశేఖర్, భరత్‌రెడ్డి, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల విడుదల

మక్తల్: హాత్‌సే హాత్ జోడో యాత్ర ఈనెల 26 నుంచి చేపట్టనున్న సందర్భంగా మంగళవారం మక్తల్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి పోస్టర్‌లను విడుదల చేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే , రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్ద ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టే యాత్రను విజయవతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ పోలీస్‌చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీ నాగన్న, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24న మంత్రి కేటీఆర్ రాక



దామరగిద్ద: రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఈనెల 24 న జిల్లా కేంద్రంలోని వివిధ అభివృద్ధి పనుల ప్రారంభానికి రానున్నారని ఈ మేరకు నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని బీఆర్ఎస్ మండల నాయకులు ఆశన్న, ఎంపీపీ నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు వెంకట్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు భీంరెడ్డిలు అన్నారు. శుక్రవారం కాన్‌కుర్తిలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు.

'సంపద కొల్లగొడుతున్నారు'



ధన్వాడలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ధన్వాడ: మన ఊరు మన బడి పేరుతో ఇసుక మాఫియాకు సహకరిస్తూ అధికారపార్టీకి చెందిన కొందరు ప్రభుత్వ సంపదను కొల్లకొడుతున్నారని బీఎస్పీ పేట ఇన్‌చార్జ్ బొడిగెలి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మాట్లాడుతూ గోటూర్ వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు ప్రభుత్వ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం, బీఆర్ఎస్ నాయకులు సహకరిస్తున్నారని ఆరోపించారు. కనీస పర్యవేక్షణ కరువయ్యిందని వాపోయారు. అనుమతులు రద్దు చేసి ఇసుక మాఫియాకు సహకరిస్తున్న ప్రభుత్వ అధికారులపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ వెంకటేష్, మండల అధ్యక్షులు రవియాదవ్, మైనారిటీ కన్వీనర్ సయ్యద్ మహమూద్ బీఎస్పీ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న నాయకులు

మాగనూర్: నాణ్యమైన విద్య సామాన్యుడికి రోజురోజుకు దూరమైపోతుందని కార్పొరేట్ విద్యను నిషేధించి, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేయాలని డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యచంద్ర అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నేరడగం గ్రామ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. విద్య కార్పొరేట్ శక్తుల చేతుల్లో చిక్కినప్పటి నుంచి దాని ప్రభావం ప్రభుత్వ విద్యపై తీవ్రంగా ఉందని అన్నారు. అరకొరగా ఉన్నప్రభుత్వ పాఠశాలలలో సరైన సదుపాయాల లేకపోవడం, విద్యార్థుల సంఖ్యకు సరిపడా టీచర్లు ఉండకపోవడం పేదలను విద్యకు దూరం చేస్తున్నాయని వాపోయారు. విద్యలో అసమానతలు ఉండరాదని అన్నారు. సర్పంచ్ అశోక్‌గౌడ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు స్వప్న, కవిత, సౌమ్య, రాములు, సురేష్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో..

ఊట్కూరు: మండలంలోని ముగ్దుంపూర్ పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో 2023 నూతన క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాంగోపాల్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో తమ అభ్యర్థిగా భుజంగరావు పోటీ చేస్తున్నారని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు వెంకటేశ్వర్లు, బాలప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో సత్తాచాటాలి



జక్లేర్‌లో మెటీరియల్స్ అందజేస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: పదో తరగతి విద్యార్థులు తుది పరీక్షల్లో 10కి 10 పాయింట్లు సాధించి సత్తాచాటాలని వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మక్తల్ మండలం జక్లేర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదోతరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ అందించారు. గతంలో 11 పేపర్లు ఉండేవని ప్రస్తుతం ఆరు పేపర్లకు వాటిని కుదించారని అందుకు అనుగుణంగా మెటీరియల్స్‌ను తయారు చేయించామన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని అన్నారు. విద్యార్థుల కోసం తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని పాఠశాలలన్నింటిలోనూ మెటీరియల్స్ అందిస్తామనన్నారు. మెటీరియల్ కోసం 8367266777 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ మేరకు ఆయనను ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు. సర్పంచ్ నర్సిములు, హెచ్ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు గురురాజరావు, వెంకట్‌రాములు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌గౌడ్, సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో డీటీఓ యాదగిరిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నూతన పేరివిజన్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రకటించాలని, ప్రతి నెల 1వ తేదీనే పెన్షన్ అందించాలని కోరారు. ఆదాయపన్ను మినహాయింపు స్లాబ్ 10లక్షలకు సవరించాలని, జిల్లా ఆస్పత్రిలో వెల్‌నెస్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, పాలమూర్‌కు వెళ్లి రావడానికి ఇబ్బందిగా ఉందన్నారు. సత్యనారాయణ, వెంకట్రాములు పాల్గొన్నారు.

'మనోహర్‌గౌడ్ ఆశయాలను కొనసాగిద్దాం'

నారాయణపేట రూరల్ : జిల్లా సాధన సమితి అధ్యక్షులు, ట్రస్మా జిల్లా అధ్యక్షులు, రిటైర్డ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మనోహర్‌గౌడ్ ఆశయాలను కొనసాగిద్దామని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన 65వ జయంతిని పురస్కరించుకుని జిల్లా ఆస్పత్రిలో రోగులు, వారి బంధువులకు అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా హాజరైన వివిధ సంఘాల ప్రముఖులు మాట్లాడుతూ.. జిల్లా ఏర్పాటులో అయన ఎంతో కీలకంగా వ్యవహరించారని, జల సాధన సమితిలో ఉండి పోరాటం చేశారని అన్నారు. ఇటు ప్రభుత్వ కళాశాలతో పాటు ప్రైవేటు పాఠశాలను ఏర్పాటు చేసి ఎంతో మంది విద్యార్థులకు చదువును అందించారని చెప్పారు. అంతకుముందు లిటిల్‌స్టార్స్ స్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కుటుంబ సభ్యులు ఉమాదేవి, కిరీటిగౌడ్, కీర్తి, సతీస్‌గౌడ్, దామోదర్‌గౌడ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంజిత్‌కుమార్, బి.రాము, సుదర్శన్‌రెడ్డి, నందునామాజీ, కన్నజగదీష్, రఘువీర్‌యాదవ్, చెన్నారెడ్డి, వినోద్, సుభాష్, వెంకటయ్య, రాజేష్, యాదయ్య పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్



బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

మాగనూర్: మండలంలో ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ సీఐ నాగేందర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ ఫర్వీద్ ఎదుట శుక్రవారం బైండోవర్ చేశారు. కాగా కర్ణాటక, గోవా రాష్ట్రల నుంచి అక్రమంగా మద్యం తీసుకు వచ్చి ఈ ప్రాంతంలో అమ్మె అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తుగా బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారు మద్యం అమ్మితే రూ.2 లక్షల వరకు జరిమానా ఉంటుందన్నారు. అంతే కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



కోస్గిలో విద్యార్థులతో కలిసి వేడుకలు జరుపుకొంటున్న ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి

కోస్గి: ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యేను గజమాలతో సన్మానించారు. అంతకుముందు గ్రామాల్లో, స్థానిక శివాజీ చౌరస్తాలో, కోస్గి బాలికల వసతి గృహంలో విద్యార్థుల మధ్య ఎమ్మెల్యే కేక్ కోశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ మ్యాకల శిరీష, ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ భీంరెడ్డి, వైస్ చైర్మన్ వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు హన్మంత్ రెడ్డి, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు మ్యాకల రాజేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వర ప్రసాద్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒడిశా మహిళపై అత్యాచారయత్నం


- యువకుడిని పట్టుకుని దేహశుద్ధి చేసిన బాధితురాలి భర్త, కూలీలు

మాగనూర్: బతుకుదెరువు కోసం ఒడిశా నుంచి వచ్చి ఇటుక బట్టీలలో పనిచేస్తున్న ఓ మహిళపై యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నల్లగట్టు మారెప్ప ఆలయం సమీపంలో ఇటుక బట్టీల వద్ద ఒడిశా నుంచి వచ్చిన ఓ కుటుంబం పనిచేస్తోంది. కృష్ణ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు బట్టీల వద్దకు వస్తున్నాడు. ఈ క్రమంలోనే గురువారం అర్ధరాత్రి సదరు మహిళపై అత్యాచారానికి యత్నించగా.. బాధితురాలు కేకలు వేయడంతో ఆమె భర్త, ఇతర కూలీలు యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. కాగా ఈ విషయం బయట రాకుండా సదరు ఇటుక బట్టీల యజమాని యత్నించారు. బాధితురాలికి, ఇతర మహిళలకు తెలుగు రాకపోవడంతో జరిగిన అన్యాయం ఎవరికీ చెప్పలేని పరిస్థితి తలెత్తింది. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నరేందర్ తెలిపారు.

ఎంపీడీఓ కార్యాలయంలో పార్టీ మీటింగ్!

కోయిల్‌కొండ: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు సమావేశాలు ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని మాజీ ఎంపీపీ వై.మహేందర్‌గౌడ్ అన్నారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు పార్టీ సమావేశాన్ని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేయడంపై శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎంపీడీఓ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు బీఆర్ఎస్ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు మీటింగ్‌లు నిర్వహిస్తుంటే అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామునాయక్, బండి యాదవ్‌కుమార్, విద్యాసాగర్‌గౌడ్, జగన్‌గౌడ్, మనోజ్‌కుమార్, నాగరాజు, వెంకటయ్య, నర్సిములు, లక్ష్మణ్‌నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జలాభిషేకం



జలాభిషేకంలో పాల్గొన్న భక్తులు.

నర్వ: మండలంలోని రాంపురం గ్రామంలో శుక్రవారం గ్రామ భక్త సమాజం ఆధ్వర్యంలో ఘనంగా శివాలయంలో సహస్రఘట జలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటాలతో జలాన్ని తీసుకోని ఊరేగింపుగా ప్రత్యేక భజనలతో ఆలయం వరకు వచ్చారు. అర్చకులు నాగస్వామి లింగాష్టకం, బిల్వాష్టకం, మహాన్యాసరుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. గురుస్వామి భగవంతాచారి, శివస్వాములు, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ఆరాధన ఉత్సవాలు

నారాయణపేట టౌన్ : పరిమాళపురంలో వెలసిన శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో శనివారం పురందాసుల ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు నరసింహాచారి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. పురవీధుల గుండా గోపాల కార్యక్రమం ఉంటుందన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.